క్లుప్తంగా

నివాళి..



జనాజా కార్యక్రమంలో పువ్వాడ, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు అబ్బాస్ అనారోగ్యంతో మృతి చెందగా అబ్బాస్ మృత దేహాన్ని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సందర్శించి నివాళులర్పించారు. జనాజా కార్యక్రమంలో పువ్వాడ పాల్గొన్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్లు, నాయకులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

మూడేళ్ల పోరాటంతో దక్కిన ఇల్లు



ఆలయం వద్ద ఇంటి మంజూరు పత్రంతో వీరబాబు

నేలకొండపల్లి: నిలువ నీడలేని ఆ నిరుపేద కుటుంబం ఇంటి కోసం మూడేళ్లుగా చేస్తున్న పోరాటం ఫలించింది. చివరకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో పట్టా అందుకున్న సందర్భంగా మొక్కు చెల్లించుకున్నారు. మండలంలోని రాజేశ్వరపురానికి చెందిన మునగంటి వీరబాబు–లక్ష్మి దంపతులకు ఇరువురు కుమార్తెలు ఉన్నారు. సెంట్ భూమి లేకపోగా, ఇల్లు కూడా లేకపోవడంతో పలుమార్లు ఆందోళన చేశారు. గ్రామంలో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కూడా దక్కకపోవడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడమేకాక గ్రామంలో ఏ సభ జరిగినా నిరసన, దీక్షలు చేసేవారు. ఈక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లగా ఆయన ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఇటీవల పట్టా అందజేశారు. దీంతో సూర్యాపేట జిల్లా కోదాడ మండలం యర్రవరంలో శ్రీ బాల ఉగ్ర నరసింహస్వామి ఆలయంలో వీరబాబు శనివారం తలనీలాలు సమర్పించి మొక్కు చెల్లించుకున్నాడు.

మంత్రి పొంగులేటికి వినతి

ఖమ్మంమయూరిసెంటర్: తెలుగు జర్నలిస్టులతో పాటు ఉర్దూ జర్నలిస్టులకు కూడా అక్రిడేషన్ల జారీలో సమాన ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ ఉర్దూ జర్నలిస్టు ఫోరం నాయకులు హాఫీజ్ మొహమ్మద్, జవ్వాద్ అహ్మద్ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అక్రిడేషన్లతోపాటు ఇళ్ల స్థలాలకు సంబంధించిన విషయంలోనూ, అక్రిడేషన్ కమిటీల్లో స్థానం కల్పించాలని మంత్రిని కోరారు. ఉర్దూ దినపత్రికలకు సంబంధించి నియోజకవర్గానికి ఒక్కో అక్రిడేషన్ ఇవ్వాలని కోరారు. ఇంతియాజ్, మహమ్మద్ అబ్దుల్ ఆహద్ ఉన్నారు.

కుల వృత్తులను కాపాడాలి



ర్యాలీలో నాయీబ్రాహ్మణులు

ఖమ్మం మామిళ్లగూడెం: తరతరాలుగా కులవృత్తినే నమ్ముకుని అనేక జాతులు తమ జీవన విధానాన్ని కొనసాగిస్తున్నాయని కులవృత్తులను కాపాడాలని నాయీబ్రాహ్మణ సేవా సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులు యలమందల జగదీష్, గుండ్లపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని మొగిలి పాపిరెడ్డి ఫంక్షన్ హాల్ నుంచి బల్లేపల్లి వరకు నాయీబ్రాహ్మణులు శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కులవృత్తులను కాపాడడానికి ప్రభుత్వాలు ప్రత్యేకమైన చట్టాలను తీసుకురావాలని, తరతరాలుగా చదువు ఉద్యోగాలను వదిలేసి ప్రజా శ్రేయస్సు దృష్ట్యా కులవృత్తినే నమ్ముకొని జీవన విధానాన్ని కొనసాగిస్తున్నామన్నారు. కార్పొరేట్ సెలూన్లను తొలగించే వరకు పోరాడుతామని హెచ్చరించారు.

అర్హులకే ఇళ్లు ఇవ్వాలి

తిరుమలాయపాలెం: ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అనర్హులకు ఇళ్లు మంజూరయ్యాయని, రీ సర్వే నిర్వహించి అర్హులైన వారికి ఇళ్లు ఇవ్వాలని కోరుతూ శనివారం బీరోలు గ్రామానికి చెందిన ప్రజలు ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, డిప్యూటీ తహసీల్దార్ సుధీర్‌కి శనివారం వినతిపత్రం అందజేశారు. అనర్హులకు ఇళ్లు కేటాయించడం సరికాదన్నారు. రమేష్, నాగేశ్వరరావు, సామేల్, సతీష్, రజిత, నిర్మల ఉన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కుబేర
వినోద	సితారే జమీన పర్
ఆదిత్య	8 వసంతాలు
శ్రీనివాస	కుబేర

– ఖమ్మం గాంధీచౌక్

మారుతున్న రూపురేఖలు!

నగరంలో శరవేగంగా రోడ్లు, డ్రెయినేజీ పనులు

- రూ.68.28 కోట్లు మంజూరు
- నిరంతరం అధికారుల పర్యవేక్షణ



డ్రెయినేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కేఎంసీ ఇంజనీరింగ్ అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నో ఏళ్లుగా రోడ్లు, డ్రెయినేజీలు లేక అవస్థలు పడుతున్న శివారు ప్రాంతాల ప్రజల చిరకాల స్వప్నం సాకారం కానుంది. నగరం కొన్నేళ్లుగా గణనీయమైన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా, మెరుగైన రవాణా సౌకర్యాలు, సమర్థవంతమైన పారిశుద్ధ్య వ్యవస్థ అత్యవసరం. ఈ అవసరాలను గుర్తించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిధులను కేటాయించి, వీటి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో నగర పాలక సంస్థ పాలకవర్గం, అధికారులు డ్రెయినేజీలు, రోడ్లు లేని ప్రాంతాల నుండి ప్రతిపాదనలు తీసుకొని వీటి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రధాన రహదారుల విస్తరణ, కొత్త రోడ్ల నిర్మాణం, అంతర్గత రహదారుల మరమ్మతులు, పాత డ్రెయినేజీ వ్యవస్థల పునరుద్ధరణతో పాటు, అధునాతన డ్రెయినేజీ వ్యవస్థల ఏర్పాటు వంటి పనులు చేపడుతున్నారు. నగరంలోని మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా చేసుకుని కేఎంసీ పరిధిలో రూ.68.28 కోట్లతో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రోడ్లు, డ్రెయినేజీలు లేని ప్రాంతాల్లో వీటి నిర్మాణానికి 2023 డిసెంబర్ 24 నుండి 2025 మే నెల వరకు 140 పనులకు ప్రతిపాదనలు చేసి, నిధులను మంజూరు చేశారు. మొత్తం 140 పనులలో ఇప్పటికే 54 పనులు పూర్తికాగా.. 86 పనులు ప్రస్తుతం వివిధ దశలలో పురోగతిలో ఉన్నాయని అధికారులు వెల్లడించారు. ఈ పనులకు ఎంజీఎఫ్, 15వ ఆర్థిక సంఘం, ఎస్‌డీఎఫ్, ఎల్ఆర్ఎస్ నిధులు వినియోగిస్తున్నారు.

పూర్తవుతున్న పనులు..

ఇప్పటికే పూర్తయిన 54 పనులు నగరంలో గణనీయమైన మార్పును తీసుకువచ్చాయి. ఇరుకైన రోడ్లు విశాలంగా మారి, ట్రాఫిక్ రద్దీ తగ్గి, వాహనదారులకు ప్రయాణం సుఖమయం అయ్యింది. ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే మురుగునీటి సమస్యను నివారించడంలో కొత్తగా నిర్మించిన డ్రెయినేజీలు ఎంతగానో సహాయపడనున్నాయి. నగరంలోని లోతట్టు ప్రాంతాలు గతంలో వర్షపు నీటితో నిండిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. కానీ, పకడ్బందీగా నిర్మించిన డ్రైనేజీ వ్యవస్థల వల్ల ఈ సమస్యకు పరిష్కారం లభించనుందని అధికారులు వెల్లడిస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ..

ప్రస్తుతం పురోగతిలో ఉన్న 86 పనులను కూడా వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. వీటిలో కొన్ని నగరంలోని కీలక ప్రాంతాలను కలుపుతూ నిర్మిస్తున్న రోడ్లు కాగా, మరికొన్ని ప్రజల ఆరోగ్యానికి అత్యంత కీలకమైన డ్రెయినేజీ పనులు. ఈ పనులను కేఎంసీ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిశీలన చేస్తున్నారు. నగర మేయర్, కమిషనర్ పనులపై నిరంతరం ఆరా తీస్తున్నారు.

కేఎంసీ సమాచారం..

విద్యుత్ వైర్లకు మరమ్మతులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ నుండి ఐటీ హబ్ వరకు డివైడర్లలో ఉన్న విద్యుద్దీపాలు వెలగకపోవడంతో సిబ్బంది పరిశీలించారు. తెగి ఉన్న వైర్లను గమనించిన సిబ్బంది వాటికి మరమ్మతులు చేశారు.

జటాయు పనితీరు పరిశీలన..

నగరంలోని ప్రధాన రోడ్ల వెంట ఊడ్చి పోగు చేసిన వ్యర్థాలను ఎత్తుతున్న జటాయు పనితీరును అధికారులు పరిశీలించారు. కార్మికులు, ట్రాక్టర్లతో పని లేకుండా దుమ్ముతో పాటు, ఇతర వ్యర్థాలను జటాయువు మిషన్ సులువుగా ఎత్తుతుందని అధికారులు పేర్కొన్నారు.

నర్సరీల పరిశీలన..

నగరంలో కేఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలను ఉద్యాన అధికారిణి బెల్లం రాధిక పరిశీలించారు. నర్సరీలను సందర్శించిన ఆమె మొక్కల ఎదుగుదలను పర్యవేక్షించారు.



డ్రెయినేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కేఎంసీ ఈఈ కృష్ణలాల్

డ్రెయినేజీల నిర్మాణ పనులు..

నగరంలోని పలు ప్రాంతాల్లో డ్రెయినేజీలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించారు. ఈఈ కృష్ణలాల్ రైల్వేస్టేషన్ రోడ్డులో డ్రెయినేజీ నిర్మాణ పనులను పరిశీలించి కాంట్రాక్టర్‌కు, ఇంజనీరింగ్ విభాగ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ట్యాంక్‌బండ్‌పై ఫుడ్ ఫెస్టివల్



ఫుడ్ ఫెస్టివల్‌లో ఏర్పాటుచేసిన స్టాళ్లు

ఖమ్మంమయూరిసెంటర్: వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఖమ్మం నగరంలోని లకారం ట్యాంక్‌బండ్‌పై మెప్మా ఆధ్వర్యంలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఫుడ్ ఫెస్టివల్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లలో మహిళ సభ్యులు రకరకాల వంటలను చేసి విక్రయించారు. మెప్మా టీఎంసీ జి.సుజాత ఫుడ్ ఫెస్టివల్‌ను పర్యవేక్షించగా సీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తసేకరణపై అవగాహన

ఖమ్మం మామిళ్లగూడెం: వంద రోజుల ప్రణాళికలో భాగంగా 51 డివిజన్, హనుమాన్ టెంపుల్ వద్ద హౌస్ హోల్డర్స్‌కు తడి, పొడి చెత్త గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. అదేవిధంగా ప్లాస్టిక్ వినియోగానికి సంబంధించిన ప్రమాదాలను, దాని దుష్పరిణామాలను వివరించారు. కార్పొరేటర్ శీలంశెట్టి రామ వీరభద్రం, మున్సిపల్ ఎస్సై శ్రీనివాస్, జవాన్లు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయించాలి



ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న రమేష్

నేలకొండపల్లి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయించాలని పాలేరు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఎల్.రమేష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిని గ్రామాల వారీగా అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులతో సమన్వయం చేస్తూ ముందుకు సాగాలని సూచించారు. అనంతరం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి శివ, హౌజింగ్ ఏఈ లింగా, పంచాయతీ కార్యదర్శులు బైరం దినేష్‌కుమార్, శ్రీనివాస్, వైద్యాధికారి డాక్టర్ మంగ్ల తదితరులు పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డి అరెస్ట్ సరికాదు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజా సంక్షేమానికి నిరంతరం పని చేస్తున్న హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా అరెస్ట్ చేయడం సరికాదని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న ప్రతీ ఒక్కరిపై తప్పుడు కేసులు బనాయించి అరెస్టులు చేయడం ద్వారా ప్రజల గొంతును అణిచివేయాలన్న ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ఇలాంటి కుట్రలతో బీఆర్ఎస్ పార్టీ వెనక్కి తగ్గదని, ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాటం ఇంకా ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: కేరళ రాష్ట్రంలోని కోజికోడ్‌లో జరగబోయే ఎస్ఎఫ్ఐ 18వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ నెల 27 నుంచి 30 వరకు కేరళలోని కోజికోడ్‌లో సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభ విద్యార్థి ఉద్యమంలో ఒక మైలురాయిగా నిలుస్తుందని, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం సిద్ధాంతాలను బలోపేతం చేయడానికి కృషి చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యారంగంలో మతతత్వం తీసుకొచ్చి విద్యా వ్యవస్థను కార్పొరేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ భవిష్యత్ పోరాటాలకు, కర్తవ్యాలకు ఈ సభ నాంది పలుకుతుందన్నారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి గాదె వరుణ్‌కుమార్ నాయకులు నవీన్, మధు,గౌతమ్, రవీందర్ పాల్గొన్నారు.

మార్క్స్ మార్గంలో నడవక తప్పదు

ఖమ్మం మామిళ్లగూడెం: కారల్ మార్క్స్ మార్గంలో పెట్టుబడిదారీ వ్యవస్థ నడవక తప్పదని సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, యర్రా శ్రీనివాసరావులు అన్నారు. శనివారం సీపీఎం ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యాన జరుగుతున్న రాజకీయ శిక్షణ తరగతులు చౌడపు వెంకటేశ్వర్లు సరస్వతి ఫంక్షన్ హాల్‌లో జరిగాయి. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, జిల్లా కమిటీ సభ్యులు ఎస్కే.మీరా, జబ్బర్, దొంగల తిరుపతిరావు, బండారు యాకయ్య, వన్, టూ, త్రీ టౌన్, ఖమ్మం అర్బన్ కార్యదర్శులు నాగుల్ మీరా, బోడపట్ల సుదర్శన్, శ్రీనివాసరావు, బత్తిని ఉపేందర్ పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ఖమ్మంమయూరిసెంటర్: ఆపరేషన్ కగర్‌ను ఆపాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిర్వహించనున్న చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జాతీయ నాయకులు నానబాల రామకృష్ణ కోరారు. ఈ మేరకు శనివారం ఖమ్మంలోని జెడ్పీసెంటర్‌లో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు ఉపేందర్, శ్రీనాథ్, రవి, రఫీ, గోపి, రవీదంర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఐఏఎల్ సమావేశంలో నాయకులు

ఖమ్మం లీగల్: ఐఏఎల్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో న్యాయవాదుల సమస్యలపై సమావేశం నిర్వహించినట్టు ఐఏఎల్ జిల్లా అధ్యక్షుడు షేక్ లతీఫ్ శనివారం తెలిపారు. ఈ సమావేశంలో తనతోపాటు కార్యదర్శి ఓరుగంటి శేషగిరిరావు, పట్టణ అధ్యక్షుడు జీవీ లక్ష్మీనారాయణ, పట్టణ కార్యదర్శి ఎం.సతీష్ పాల్గొన్నారన్నారు.

ఆర్టీసీ టూర్ ప్యాకేజీని వినియోగించుకోవాలి

ఖమ్మంమయూరిసెంటర్: టీజీఎస్ ఆర్టీసీ టూర్ ప్యాకేజీలో భాగంగా అన్నవరం, వాడపల్లి, భద్రాచలం, కిన్నెరసాని ప్రాంతాలకు ప్రయాణికులను తీసుకెళ్లనున్నట్లు ఖమ్మం డిపో మేనేజర్ దినేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్యాకేజ్‌లో భాగంగా ఈ నెల 27న ఉదయం 8 గంటలకు డీలక్స్ బస్సు బయలుదేరి అన్నవరం సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం, వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో స్వామివార్ల దర్శించుకుని, 28న ఉదయం భద్రాచలం చేరుకుని శ్రీ సీతారామచంద్ర స్వామి దర్శనం అనంతరం కిన్నెరసాని ప్రాజెక్టు సందర్శన 28న సాయంత్రం ఖమ్మం చేరుకుంటుందని తెలిపారు. ఈ మేరకు ఒక్కొక్కరికి రూ.1,200 చార్జి చేయడం జరుగుతుందని ఈ టూర్‌కు వెళ్లే ప్రయాణికులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రైతుభరోసా నగదు రైతులకే ఇవ్వాలి

ఖమ్మంమయూరిసెంటర్: వానాకాలం పంటల పెట్టుబడి కోసం రైతు భరోసా కింద ప్రభుత్వం రైతులకు ఇచ్చిన డబ్బులు రైతులకే ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ.. రైతుల అకౌంట్లలో వేసిన రైతుభరోసా డబ్బులను బ్యాంక్‌లు హోల్డ్‌లో పెడుతున్నాయని, ఈ సమస్య ప్రధానంగా ప్రభుత్వం రుణమాఫీ చేయని రైతులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం రుణమాఫీ చేయక, రైతుభరోసా కూడా తీసుకోవడం సరికాదన్నారు.

రాష్ట్ర సాధనలో జయశంకర్ పాత్ర మరువలేనిది



ఖమ్మం మామిళ్లగూడెం: మాట్లాడుతున్న డాక్టర్ కేవీ.కృష్ణారావు



ఖమ్మంమయూరిసెంటర్: విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో..



ఖమ్మంలీగల్: మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ పాత్ర మరువలేనిదని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కె.వి కృష్ణారావు అన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఐక్యతా దివస్‌ను అమరవీరుల స్థూపం వద్ద శనివారం జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శంకర్‌రావు, నరేందర్, వీరభద్రం, సతీష్, జానీ, విజయకుమార్, వరలక్ష్మి, వెంకటేశ్వర్లు, హుస్సేన్, బురాన్, ఆసిఫ్, చౌహన్, భాస్కర్‌రెడ్డి, అనంతలక్ష్మి, సంతోష్, ధనలక్ష్మి, లక్ష్మి, గురుమూర్తి, నాగుల్ మీరా ఉన్నారు.

ఖమ్మంలీగల్: ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా బార్ అసోసియేషన్ హాల్‌లో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బార్ అధ్యక్షుడు తొండెపు వెంకటేశ్వరరావు మాట్లాడగా పలువురు పాల్గొన్నారు.

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని కొత్తూరు సర్కిల్‌లో జయశంకర్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్పొరేట్ వెంకటేశ్వర్లు, తుమ్మ అప్పిరెడ్డి, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

యోగా సాధనతో సంపూర్ణ సిద్ధిస్తుందని పలువురు వక్తలు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో యోగా సాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువులు యోగాసనాలు వేసి ఆసనాల ప్రాముఖ్యతను తెలియజేశారు. యోగాతో శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటామన్నారు. ప్రతీ రోజు కొంత సమయం యోగాకు కేటాయిస్తే ఎలాంటి ఒత్తిళ్లు దరిచేరకుండా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంలీగల్: కోర్టు ఆవరణలో ఆసనాలు వేస్తున్న జిల్లా జడ్జి జి.రాజగోపాల్, తదితరులు



ఖమ్మంవ్యవసాయం: నగరంలోని వీడీవోస్ కాలనీ సమీకృత మార్కెట్‌లో..



ఖమ్మంక్రైం: పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో..



ఖమ్మంమయూరి సెంటర్: ఎస్సీ బాలుర వసతిగృహం(బి)లో యోగా చేస్తున్న విద్యార్థులు



ఖమ్మం స్పోర్ట్స్: టీఎన్జీవోస్ భవన్‌లో యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు



తిరుమలాయపాలెం: కాకరవాయి పాఠశాలలో..



కామేపల్లిలో..



ఖమ్మంవైద్యవిభాగం: మెడికల్ కాలేజీ ఆవరణలో..



నేలకొండపల్లిలో..



ఖమ్మం అర్బన్: బ్లూమింగ్ పాఠశాలలో..



రఘునాథపాలెం: వేణుగోపాల్‌నగర్ పాఠశాలలో..



ఖమ్మం సహకారనగర్: ఎస్‌వీఎం సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో మాట్లాడుతున్న డైరెక్టర్ శ్రీధర్‌రావు



రెజొనెన్స్ శ్రీనివాసనగర్‌లో..



విన్‌ఫీల్డ్ స్కూల్‌లో..